విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

దివిసీమలో రాజీవ్ గాంధీ వర్ధంతి

విశాలాంధ్ర-అవనిగడ్డ : దివిసీమలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజీవ్‌గాంధీ వర్ధంతిని పెద్ద ఎత్తున నిర్వహించారు. భరతమాత ముద్దు బిడ్డ నవభారత నిర్మాత భారత రత్న దివంగత కాంగ్రెస్‌నేత కాంగ్రెస్ నేత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధి 32వ వర్ధంతిని ఆదివారం ఉగ్రవాద నిరోధిక దినోత్సవంగా అవనిగడ్డ మండల పార్టీ కాంగ్రెస్ అధ్యక్షులు దిడ్ల వీర రాఘవుల ఆధ్వర్యంలో నిర్వహించారు. వంతెన సెంటర్‌లోగల రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళ్ళు అర్పించి మాట్లాడుతూ భారత ప్రధారమంత్రిగా అతి చిన్న వయస్సులో 40సం॥లకే అయిన వ్యక్తి రాజీగాంధీ అన్నారు. ఆయన మరణం అనంతరం అత్యున్నత పురస్కారాన్ని బహకరించారన్నారు. రాజీవ్‌గాంధీకి నివాళ్ళు అర్పించిన వారి నరహారశెట్టి శ్రీమన్నానాయణ, ఆదిరాంమోహానరావు షెక్ గౌస్, మండల వెంకటేశ్వరావులతో పాటు పలువురు ఆ పార్టీ అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణహిత జీవనశైలి అలవర్చుకోవాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం : ప్రతి ఒక్కరూ పర్యావరణహిత జీవనశైలిని అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు పిలుపునిచ్చారు. ఆదివారం మిషన్ లైఫ్ 2023 కార్యక్రమంలో భాగంగా మంగినపూడి సముద్ర తీరం వద్ద ఆంధ్ర ప్రదేశ్ కాలుష్య నియంత్రణ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ లైఫ్ 2023 కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు జిల్లాలో అన్ని మండలాల్లో మిషన్ లైఫ్ పేరిట 75 పర్యావరణ విభాగాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వాటిలో ముఖ్యంగా ఏడు విభాగాలైన నీటి పొదుపు, విద్యుత్ పొదుపు, వ్యర్థాలు తగ్గింపు, ఈ-వ్యర్థాల తగ్గింపు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, సస్టైనబుల్ ఫుడ్ సిస్టమ్, హెల్తీ లైఫ్ స్టైల్ వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల ఎన్నో అనర్థాలు ఉన్నాయని వివరిస్తూ ఆహారం దొరక్క పశువులు నిత్యం ప్లాస్టిక్ ని ఆహారంగా తీసుకుని అనారోగ్యం పాలవుతున్నాయని ఇది ఎంతో బాధాకరమన్నారు. ఒకసారి వాడి పారేసిన ప్లాస్టిక్ భూమిలో కలవడానికి ఎన్నో ఏళ్లు పడుతుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని ప్లాస్టిక్ నిషేధాన్ని స్వచ్ఛందంగా పాటించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, బందరు డివిజన్ రెవెన్యూ అధికారి ఐ.కిషోర్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ బోర్డు పర్యావరణ ఇంజనీరు టి. ప్రసాద రావు, జిల్లా అటవీ శాఖ అధికారి రాజశేఖర రావు, సహాయ పర్యావరణ ఇంజనీరు కే.జ్యోత్స్న శ్రీ, భద్రత మరియు బాధ్యత ఫౌండేషన్ నిర్వాహకులు బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం తగ్గించండి

విశాలాంధ్ర-పెదపారుపూడి : ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలని మండల ఈవోపీఆర్డీ ఎం. నాగిరెడ్డి ఆదివారం అన్నారు. మండలంలోని వెంట్రప్రగడ గ్రామ బస్టాండ్ సెంటర్లో ప్లాస్టిక్ గ్లాసులు తదితర వస్తువులు పంట కాలువలో, రోడ్ల వెంబడి వాడేసి ప్రక్కన పడేయడం వలన అనేక అనారోగ్యాలకు కారణం అవుతుందని అన్నారు. ప్రతి ఒక్కరు ఈ విషయమై పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈనెల 19వ తేదీ నుండి వచ్చే నెల ఆరో తేదీ వరకు ప్లాస్టిక్ నిషేధం పై మండలంలో గ్రామ గ్రామాన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నందున ప్రజలు ప్లాస్టిక్ వాడకని తగ్గించి పర్యావరణాన్ని పెంపొందించే విధంగా ఎవరికి వారే నడుచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన సూచించారు.

రైతు బాంధవుడు కొల్లి నాగేశ్వరరావు

విశాలాంధ్ర-చల్లపల్లి : రైతు బాందవుడు కొల్లి నాగేశ్వరరావు అని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అద్దాడ ప్రసాద్‌బాబు నివాళులు అర్పించారు. కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు కొల్లి నాగేశ్వరరావు ద్వితీయ వర్ధంతి స్థానిక చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌బాబు మాట్లాడుతూ కామ్రేడ్ కొల్లి నాగేశ్వరరావు బాల్యం నుండి కమ్యునిస్టు భావాలను ఆకలింపుచేసుకొని అన్యాయాలను ఎదిరించడం ప్రారంభించారన్నారు. హైస్కూల్లో విద్యార్థి దశలో ఏఐఎస్ఎఫ్ సభ్యునిగా చేరి ఉద్యమ ప్రస్థానం ప్రారంభించారన్నారు. విజయవాడ ఎస్ఆర్ఆర్ కళాశాలలో డిగ్రీ చదివే రోజుల్లో అక్కడ కొల్లి నాగేశ్వరరావుతో పాటు ఈడ్పుగంటి నాగేశ్వరరావు, పొట్లూరి నాగేశ్వరరావు, పువ్వాడ నాగేశ్వరరావు తదితరులతో కలిసి విద్యార్థి ఉద్యమానికి నాయకత్వం వహించారని గుర్తు చేశారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అంటూ సాగిన విశాఖ ఉక్కు ఉద్యమంలో విద్యార్థి నాయకునిగా కీలక పాత్ర వహించారన్నారు. నమ్మిన సిద్ధాంతం కోసం కడవరకు పనిచేసిన కమ్యూనిస్టు నాయకుడున్నారు. ఉవ్వెత్తున సాగిన కృష్ణా డెల్టా ఉద్యమంలో అలుపెరగని పోరాటం చేసిన అపర భగీరథుడని కొనియాడారు. తాను నమ్మిన కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పేదల పక్షాన అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. తొలుత నాయకులు కొల్లి నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు. పార్టీ సీనియర్ నాయకులు మల్లుపెద్ది జగన్మోనరావు (లెనిన్), నక్కా శ్రీనివాసరావు, ఏఐవైఎఫ్ నాయకులు లంకా నాగమల్లి, సిధాబత్తుల వాసు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు సేవారత్న అవార్డులు

విశాలాంధ్ర-అవనిగడ్డ : వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న సేవామిత్ర అవార్డులను అందచేశారు. ఆదివారం వైయస్ఆర్ నియోజకవర్గ పార్టీ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఇన్‌చార్జ్ యంపిడిలో పి శైలజాకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా సింహాద్రి రమేష్‌బాబు పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల అముల్లో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్నారని వాలెంట్రీల పనితీరును కొనియాడారు. ఇదే స్ఫూర్తితో ప్రజలకు సేవలు చేసి జగనన్నకు మచంచి పేరు తీకు రావాలన్నారు. 25 సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేసే విషయంలో కులం, మతం, ప్రాంతం రాజకీయ పార్టీలతో సంభందం లేకుండా అర్హతే ప్రామాణికంగా పేదవానికి సేవ చేయాలని జగనన్న పెట్టుకున్న నమ్మకం ప్రభుత్వ పథకాలను వాలెంట్రీలను ప్రజల గడప వద్దకు తీసుకెళ్ళిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో యంపిపి తుంగల సుమతీదేవి, జడ్‌పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ గౌర్రుముచ్చు ఉమా, యువ నాయకుడు సింహాద్రి వికాస్, లంకమ్మ, శివాలయాల ధర్మకర్తల మండలి చైర్మన్లు అనపరెడ్డి రామదాస్, సింహాద్రి రామనాథం, వైస్ యంపిపిలు పులిగడ్డ పిచ్చేశ్వరావు, దిడ్ల కిరణ్, మండల కో-ఆప్షన్ సభ్యులు షెక్ నజీర్‌భాష, ఉపసర్పంచ్ కోడూరు సత్యనారాయణ, యంపిటి ,నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

విశాలాంధ్ర-చల్లపల్లి : యువత క్రీడల్లో రాణించాలని శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యామ్ కిషోర్ నాయుడు పిలుపునిచ్చారు. చల్లపల్లి పడమర వీధిలోని క్రికెట్ టీంకు ఆదివారం శ్యామ్ కిషోర్ నాయుడు క్రికెట్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోపాటు ఆటల్లో కూడా రాణిస్తూ తల్లిదండ్రులకు, సమాజానికి యువత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం సమాజంలో యువత ఎక్కువగా చెడు వ్యసనాల వైపు మళ్లుతున్నారని, చెడు వ్యసనాల నుంచి యువకులను ఆటల వైపు మళ్లించే సదుద్దేశంతో క్రికెట్ బ్యాట్లు, బాల్స్, వికెట్లతో కూడిన కిట్లను యువతకు అందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు అవనిగడ్డ నియోజకవర్గంలో చల్లపల్లి ఘంటసాల మోపిదేవి అవనిగడ్డ మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన క్రీడాకారులకు క్రికెట్ కిట్లను అందజేసినట్లు వివరించారు. ఆపదలో కష్టాల్లో ఉన్నవారికి నేనున్నానంటూ అన్నివేళలా ఆపన్న హస్తం అందించే తోట శ్యామ్ కిషోర్ నాయుడు సమాజ సేవా కార్యక్రమాలతో పాటు క్రీడాకారులను కూడా ప్రోత్సహించటం ఆయన గొప్పతనానికి నిదర్శనమని టీం కెప్టెన్ శివ కిషోర్ అన్నారు. తమ జట్టుకు క్రికెట్ కిట్లను అందించి ప్రోత్సహిస్తున్న శ్యామ్ కిషోర్ నాయుడుకు తన తరఫున తన జట్టు తరఫున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎం. ఎం. ఆర్. పి. ఎస్ నాయకులు పఠాన్ కరీముల్లా ఖాన్ క్రీడాకారులు పాల్గొన్నారు.

గుర్రపు డెక్కతో రైతులకు తిప్పలు

విశాలాంధ్ర-కూచిపూడి : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ నెల రోజులలో ప్రారంభం కానుండగా ఇప్పటివరకు డ్రైనేజీ అధికారులు కాలవల మరమ్మత్తులపై కానీ, దట్టంగా అల్లుకుపోయిన గుర్రపు డెక్క తొలగించదానికి కానీ ప్రయత్నాలు చేయకపోవడంతో రైతులకు ఈ ఏడాది వరి సాగు సమయంలో ఇబ్బందులు తప్పవా? అనే అనుమానాలు. అటు అయినంపూడి డ్రైన్ లోఇటు భీమనది డ్రైన్ లోగుర్రపు డెక్క మేటేసుకు .దీని మూలంగావరి సాగు సమయంలోఅధిక వర్షాలుకురిస్తేరైతుల పాటు వర్ణనాతీతం.పామర్రు,అవనిగడ్డ నియోజకవర్గం లోని పమిడిముక్కల, మొవ్వ, ఘంటసాల మండలాలలోని వేలాది ఎకరాల ముంపు పోవడానికి ఉపయోగపడే అయినంపూడి, భీమ నది మురుగు కాలవలుకుఅభివృద్ధి పనుల కోసం శ్రీకారం చుట్టిన దాఖలాలు భూతద్దం పెట్టి వెతికిన కనబడలేదు. దీనికి తగ్గట్టు ఈశాన్య రుతుపవనాలు సకాలంలోనే తాకే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతో రైతులు తొలకరి పనులకు శ్రీకారం చుట్టుకున్నారు. ఈ దశలోగుర్రపుడెక్క నిర్మూలనకై రసాయనాలు ద్వారా పనులు చేయడం కానీ,కూలీలతో తొలగించడం గానిప్రారంభించలేదు. ఈ ఏడాది వేసకాలమైన వర్షాలు కురవడంతోదీనిపై రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్లో అధిక వర్షాలు కురిస్తే పొలాలలోనిమురుగునీరుపోయెమ్ మార్గం ఉండగా వైరుతో ఉన్న పొలాల ముంపుపాలయ్యే అవకాశాలు ఉంటాయనిరైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

యోగాతో ఎన్నో లాభాలు

విశాలాంధ్ర-అవనిగడ్డ : యోగాతో మానవునికి ఎన్నో లాభాలు ఉన్నాయని గ్రంధాలయ అధికారి జి ప్రభుదాస్ అన్నారు. విద్యార్థులు విద్యతో పాటు ప్రతిరోజు యోగా కూడా క్రమం తప్పకుండా చేస్తూ ఉండాలని యోగా చేయ్యడం వలన కలిగే లాభాలను వివరించారు. గ్రేడ్ 1 గ్రంధాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణా తరగతులలో భాగంగా ఆదివారం ఉపాధ్యాయులు విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పడం, చదవడం, ఇంగ్లీషు గ్రామర్,కూచిపూడి నాట్యం, యోగా క్లాసులు తెలుగు పద్యాలు, డాన్సు. యోగా పాటలు పాడటం తదితర పోటీలలో శిక్షణ ఇచ్చారు. గ్రేడ్ 1 గ్రంధాలయ అధికారి ప్రభుదాసు ఆద్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో ఎమ్. మానస, ఎ వేదకుమారి, జి శ్రీనివాస్, పి శివకుమార్, సి.హెచ్ పద్మ, లతో పాటు పలువురు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర-గుడివాడ : లయన్స్ అఫ్ ప్రగతి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక ఏలూరురోడ్డులోని బ్యాంక్ అఫ్ బరోడా వద్ద అన్నే నవీన్ పుట్టినరోజు సందర్భంగా ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మల్లంపల్లి వెంకట్రావు, వేణుబాబు, వురిటి రామారావు, అజయ్, శీలం శ్రీనివాసరావు, వీరశేఖర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచే కర్మాగారాలు

విశాలాంధ్ర-చల్లపల్లి : గ్రంథాలయాలు విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంచే కర్మాగారాలని గ్రంథాలయ అభి వృద్ధి కమిటీ సభ్యులు వేమూరి శ్రీనివాసరావు పేర్కొన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా వివిధ పాఠశాల విద్యార్థులకు గ్రంథాలయంలోని ఉన్న పాఠ్యపుస్తకాలు, దేశ నాయకులు, నీతి కథలు వంటి పుస్తకాలను చదివించారు. పిల్లల్ని నైపుణ్యాన్ని పెంచేందుకు జూనియర్ సైన్స్ ఎక్స్పెరిమెంట్స్ వంటి పుస్తకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకొని గ్రంథాలయాల ద్వారా తమన ఇప్పుడు నేను పెంచుకోవాలని సూచించారు. వీడియో గేమ్ లను బహిష్కరించి పుస్తకాల వైపు మొగ్గు చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పి రవి ఎం డి పాషా గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమ న్ని గ్రంథాలయాధికారి కే. గణేష్ కుమార్ పర్యవేక్షించారు.

చల్లపల్లిలో ఉచిత వైద్యశిబిరం

విశాలాంధ్ర-చల్లపల్లి : ఎన్టీఆర్ ట్రస్ట్, మేకా సాయితరుణ్ మెమోరియల్ ట్రస్ట్ విజయవాడ వారి సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడ కామినేని హాస్పటల్స్ వారిచే చల్లపల్లి రాజా కళాశాలలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం జరిగింది. కామినేని హాస్పటల్కు చెందిన వైద్యులు డాక్టర్ జీవన్, డాక్టర్ శ్రీరామ్, డాక్టర్ నరసింహారావు, డాక్టర్ కుమార్లు జనరల్, ఆర్థోపెడిక్, కంటి, ఈఎన్టీ విభాగాలకు సంబంధించి 100 మందిని పరీక్షించగా, ఉచితంగా మందులు అందచేశారు. ఈసీజీ, 2డి ఎకో, షుగరు పరీక్షలు ఉచితంగా చేశారు. శిబిరాన్ని చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, విశ్రాంత ప్రిన్సిపాల్ టి.సాంబశివరావు, డాక్టర్ మాలెంపాటి శారద, ట్రస్ట్ ప్రతినిధులు మేకా మధు బింధు, మనోజ్, బండి సాయిబాబు, లీలావతి తదితరులు పర్యవేక్షించారు.

జయలక్ష్మికి ఎమ్మెల్యే సింహాద్రి నివాళులు

విశాలాంధ్ర-కోడూరు : కోడూరు మండలం మాజీ జెడ్పిటీసి సభ్యులు,మండల టిడిపి అధ్యక్షులు బండే శ్రీనివాసరావు మాతృమూర్తి జయలక్ష్మి ఇటీవల కాలంలో స్వర్గస్తుల కాగా ఆదివారం స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు జయలక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శించి జయలక్ష్మి చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

అభినందనీయంగా చిన్నారుల నృత్య ప్రదర్శన

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : జె ఎం ఎస్ నాట్యవేద (అకాడమీ ఆఫ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్) సమర్పణలో ఆదివారం సాయంత్రం హనుమంతరాయ గ్రంథాలయం హాలులో ప్రదర్శితమైన చిన్నారుల శాస్త్రీయ నృత్యాంశాలు ఆహూతుల కరతాళ ధ్వనులందుకుంటూ అభినందనీయంగా జరిగాయి. నెల నెలా నాట్యవేదం పేరిట పలు ప్రతిష్ఠాత్మకమైన శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు నిర్వహిస్తూ నాట్యవేదం నాట్యాభ్యాసకులలో మరింత ఆసక్తి,అనురక్తిని పెంపొందించే దిశలో వారికి వేదిక కల్పిస్తూ నాట్య ప్రదర్శన జరిగింది. చిన్న వయసులోనే కూచిపూడి నాట్యరంగాన మంచి గుర్తింపు తెచ్చుకొంటున్న జంగం సోదరీమణులు మనీషా చక్రవర్తి, శిరీష చక్రవర్తుల నృత్య దర్శకత్వంలో సన్నిహిత,పూజిత, దీక్ష,కుందన,అనన్విత,నేహిత, భవిష్య,యశశ్రీ,వెంపటి లాస్య, ప్రణతి,హన్విక,శ్రీనిధి,ఖ్యాతి, ఈషా,కార్తీక,రియా,సంకల్ప్ తదితర 20 మంది చిన్నారులు నాట్యం పై వారికి గల శ్రద్ధను, భక్తిని కనబరుస్తూ ప్రదర్శన నిచ్చారు. పర్యవేక్షణ జంగం విజయకుమార్ చేశారు. సభాధ్యక్షునిగా పంతుల వెంకటేశ్వరరావు,గ్రంథాలయం కమిటీ అధ్యక్ష,కార్యదర్శులు డోగిపర్తి శంకరరావు,నీలం దుర్గారావు లు,చింతా వెంకటేశ్వర్లు జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ భారతీయ సంస్కృతికి పట్టుకొమ్మలు కళలని అన్ని రంగాలలో వేగం పెరుగుతున్న నేటి సమాజంలో ఇటువంటి కళలపై బాల్యం నుంచే అవగాహన కలిగిస్తూ అభ్యసింప చేయాలని, క్రమం తప్పక కార్యక్రమాలు నిర్వహించే సంస్థను అభినందిస్తూ పిల్లలకు ఆశీస్సులు అందజేశారు. కార్యక్రమ నిర్వహణ జంగం శ్రీనివాస చక్రవర్తి చేశారు.

కోటప్పకు యడ్లపల్లి వితరణ

విశాలాంధ్ర-గూడూరు: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన తట్టవర్తి కోటేశ్వరావు (కోటప్ప) కుటుంబాన్ని పెడన నియోజకవర్గం జన సేన పార్టీ నాయకులు యడ్లపల్లి రామ సుధీర్ ఆదివారం పరామర్శించారు.

ప్రమాదవశాత్తు భవన నిర్మాణ కార్మికుడు కోటప్ప ప్రమాదవశాత్తు చెట్టు పైనుండి పడి తలకు కంటికి బలమైన గాయాలతో కాళ్లు కూడా విరిగిపోవడం జరిగింది. పెడన నియోజకవర్గం గూడూరు మండలం కోక నారాయణ పాలెం లో నివాసముంటున్న భవన నిర్మాణ కార్మికుడు కోటేశ్వరావుని యడ్లపల్లి పరామర్శించారు. ప్రాథమిక అవసరాల నిమిత్తం ఆయన కుటుంబాన్ని పరామర్శించి 5 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబం గాయాల నుండి కోలుకునే వరకు నిత్యవసర వసతులను అందజేస్తామని హామీ ఇచ్చారు. జనసేన కార్యకర్తలకు నాయకులకు వెనుదనుగా ఉంటానని ఎడ్లపల్లి రామ సుధీర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో పెడన నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు పోలగాని లక్ష్మీనారాయణ,పుల్లేటి దుర్గారావు, సాయన సురేష్ శ్రీకాంత్,తటవర్తి నరేష్, రేపల్లె పృథ్వి, వినాయక్, కోలపల్లి శ్రీకాంత్ సింగంశెట్టి అశోక్, మల్లిబాబు,నందం శివ స్వామి, దారపురెడ్డి నవీన్, అంజిబాబు మద్దాల పవన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయోజనకర వ్యాపకం ఈత

విశాలాంధ్ర-విజయవాడ : మండే ఎండ నుండి ఉపశమనానికి మాత్రమే గాక, పిల్లలకీ సెలవుల్లో ఓ ప్రయోజనకరమైన వ్యాపకానికిది దారితీస్తుందని అవార బాలల, మహిళా ఈత శిక్షకురాలు శకుంతలాదేవి తెలిపారు. ఈ వేసవి సెలవుల్లో అవార ఈతశిక్షణ ప్రాణరక్షణ అకాడమీ వద్ద శిక్షణ పొందిన పలువురు చిన్నారులు ఆదివారం వారధి క్రింద నదీ నిడివి ఈదారు. పిల్లలతో పాటు నేర్చుకున్న తల్లిదండ్రులు కొంత మంది వారితో కలిసి నది దాటారు. ఆంధ్రప్రదేశ్ రోజ్ సొసైటీ, భారతీయ సీడ్ ఎక్సేంజ్ వారి సహకారంతో వనప్రేమికులకు అవార సంస్థ నిర్వహించిన ప్రాణరక్షణ తరగతులకు, సీడ్ బ్యాంక్ లకు అనూహ్య స్పందన లభించింది. గురునానక్ కాలనీ వాసవి కమ్యూనిటీ హాలులో 3 గంటల పాటు జరిగిన ఈ శిక్షణా కార్యక్రమం మొదటి భాగంలో అనేక మంది వృద్ధులు, బాలలు ఉత్సాహంగా పాల్గొని సందేహాలు అడిగి నివృత్తి చేసుకొన్నారు. 50వేల మొక్కలను నదీతీరాన నాటిన పంకజ్ కుమార్ అనే అవార హరిత వీరుడిని మలినేని నారాయణ ప్రసాద్ సన్మానించారు. సీతామహాలక్ష్మి, లీలాకుమారి, సురేష్, విజయ్ ఏర్పాట్లు సమన్వయం చేశారు. జూన్ నెల చివరి వరకూ సెలవుల్లో సాగే ఈ ఈత శిక్షణ కార్యక్రమంలో చేరాలని ఆసక్తి గలవారు, నెలలో ఒక ఆదివారం జరిగే ఈ పౌరశిక్షణల9494126812 వాట్సప్ లో నమోదు చేసుకొనవచ్చని నిర్వాహకులు తెలిపారు.

ఐటీ రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన రాజీవ్ గాంధీ

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం : ఈ దేశంలో ఐటీ రంగంలో విప్లవాత్మక మైన మార్పులు తీసుకువచ్చి,సాంకేతిక రంగాన్ని పరుగులు పెట్టించి ఐటీ రంగాన్ని భారతదేశానికి పరిచయం చేసి ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందని ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొర్రా కిరణ్ అన్నారు. రాజీవ్ గాంధీ 32వ వర్ధంతి సందర్భంగా ఆదివారం కొండపల్లి మున్సిపాలిటీలో బి కాలనీ సెంటర్ నందు ఏర్పాటుచేసిన వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడో పుట్టిన కంప్యూటర్ రంగాన్ని మన దేశానికి పరిచయం చేసి ఎంతో మంది విద్యార్థులు సాంకేతిక విద్యను నేర్చుకునేలా చేశారన్నారు. ప్రపంచంలో దేశాన్ని గొప్పగా నిలిపిన మేధావి అని కీర్తించారు. ప్రధానంగా దేశంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని తీసుకువచ్చి కంప్యూటర్ రంగంలో దేశాన్ని ముందుకు నడిపించిన ఘనత ఆయనకే దక్కుతుంది అని, అలాగే యువతకు18 సం లకే ఓటు హక్కును కలించారని అన్నారు. మహత్మగాంధీ గ్రామస్వరాజ్యం కోరుకుంటే, ఆయన బాటనే అనుసరించిన యువప్రధానిగా రాజీవ్ గాంధీ పంచాయితి రాజ్ వ్యవస్థను చరిత్రత్మాకమైన చట్టం చేయడానికి రాజ్యాంగంలో 73వ,74 వ సవరణ చేసి గ్రామస్వరాజ్యం దిశగా మూడంచెల వ్యవస్థ 1.గ్రామ పంచాయితి, 2.మండల పరిషత్ 3.జిల్లా పరిషత్ లు ఏర్పాటు చేసి కేంద్రనిదులు నేరుగా గ్రామ పంచాయతీలోకి చేరే విధంగా చట్టం రూపొందించిన ఘనత ఈయనకు దక్కుతుందనీ ,అందుకే వీటీ ఏన్నికలు తప్పని సరి చేయడం ద్వారా గ్రామస్వరాజ్యనికి పునాదులుపడ్డాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదరిశి పోతురాజు ఏసుదాస్,చిలుకూరు సర్పంచ్ గొంది సురేష్, దార్ల నర్సింహారావు(డి న్ ర్),కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ మునిసిపాలిటీ ఉపాధ్యక్షులు చెరుకు ఆనందరావు,మాజీ పంచాయతీ మెంబర్లు రాగాల రాము,పోతురాజు థామస్ పాల్, పురిటిగడ్డ బుజ్జి, బాణావత్ హేమనాయక్ పాల్గొన్నారు.

తెలుగు వారి ఆత్మ గౌరవం ప్రపంచవ్యాప్తంగా చాటిన ఎన్టీఆర్ : కొల్లు రవీంద్ర

విశాలాంధ్ర-గన్నవరం : తెలుగు వారి ఆత్మ గౌరవం దశ దిశా వ్యాపించిన అన్న మాజీ ముఖ్యమంత్ర నందమూరి రామారావు అని మాజీ మంత్రి కొల్లు రవింద్ర అన్నారు. ఆదివారం రఫిన్ ఎస్ యం కళ్యాణ మండపం లో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు శత జయంతి కార్యక్రము నిర్వహించారు ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ తొలుత ఆంధ్ర రాష్టంలో సంక్షేమ పథకాలు అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి రామరవుకే దక్కుతుందన్నారు. రాష్టంలో జగన్ మోహన్ రెడ్డి అప్పుల అంధ్ర రాష్టం గా చేసారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మండల బుద్ధ ప్రసాద్, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, మాజీ మేయర్ గద్దె అనురాధ,మాజీ ఎమ్మెల్యే మూల్పూరి బాల కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి దొంతూ చిన్న, నీటిపారుదల సంఘం రాష్ట్ర అధ్యక్షులు అల్లా గోపాలకృష్ణ,తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

విశాలాంధ్ర-ఘంటసాల: మండల కొడాలి పరిధిలోని శాఖ గ్రంథాలయంలో 14వ రోజు వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా చిత్రలేఖనం పోటీలు గ్రంథాలయ అధికారి ఎం సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం కథల పుస్తకములు చదివించడం విద్యార్థులతో కథలు చెప్పించడం జరిగినది. విద్యార్థులలో ఉన్న సృజనాత్మకత వెలికి తీసే విధంగా వారిని ప్రోత్సహించడం జరిగిందని దీనిలో భాగంగా విద్యార్థులు వివిధ రకముల బొమ్మలను తయారు చేయడం నేర్పించారు.

గ్రంథాలయాలతో విద్యార్థులకు అపార జ్ఞానం



విశాలాంధ్ర-ఘంటసాల : గ్రంధాలయాలతో విద్యార్థులకు అపార జ్ఞానం లభిస్తుందని ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలు సద్వినియోగపర్చకోవాలని గ్రంథాలయ అధికారి ఎం శరత్ కుమార్ పేర్కొన్నారు మండల కేంద్రమైన ఘంటసాల శాఖ గ్రంథాలయంలో 14వ రోజు సమ్మర్ క్యాంపు నిర్వహించడం జరిగింది దీనిలో భాగంగా విద్యార్థి విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు కథలు చెప్పించడం, చదివించడం జరిగింది. శరత్ కుమార్ మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన బండాగారాలని జ్ఞానం ఎంత కావాలంటే అంత గ్రంథాలయాల్లో దొరుకుతుందని, ప్రతి ఒక్కరు పుస్తక పఠనం చేసుకోవడానికి గ్రంథాలయాలు ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు.

క్యాన్సర్ పేషెంట్‌కు రూ.20 వేలు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-పెడన : పెడన మండలం జింజేరు గ్రామానికి చెందిన తాత విఠల్ భార్య కు క్యాన్సర్ వ్యాధి సోకింది థర్డ్ స్టేజీలో ఈ విషయాన్ని గుర్తించారు మధ్యతరగతి కుటుంబీకుడైన విఠల్ శక్తికి మించి ఖర్చుపెట్టి తన భార్య ను బతికించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నాడు. నియో జకవర్గ జనసేన నాయకుడు యడ్లపల్లి రామ్ సుధీర్ తన వంతు సాయ ంగా విఠలకు రూ.20వేల ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు.

భూపోరాట యోధుడు కామ్రేడ్ 'కొల్లి'

విశాలాంధ్ర-తిరువూరు: భూపోరాట యోధుడు, రైతు నాయకులు, సీనియర్ కమ్యూనిస్టు నేత అమరజీవి కామ్రేడ్ కొల్లి నాగేశ్వరరావు అని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి షేక్ నాగుల్ మీరా అన్నారు. స్థానిక సుంకర వీరభద్రరావు భవన్‌లో ఆదివారం కొల్లి నాగేశ్వరరావు తృతీయ వర్ధంతి నిర్వహించారు. సీపీఐ నగర పంచాయతీ పార్టీ కార్యదర్శి మాలపాటి ఉదయ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు కొల్లి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాగుల్ మీరా మాట్లాడుతూ విద్యార్థి దశలో ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘ నాయకుడుగా ఉద్యమ ప్రస్థానం ప్రారంభించిన కొల్లి అనేక సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారన్నారు. విజయవాడలో డిగ్రీ పూర్తి చేసిన ఈర్పుగంటి నాగేశ్వరరావు, పాట్లూరి నాగేశ్వరరావు, పువ్వాడ నాగేశ్వరరావు వంటి సీనియర్ నాయకులతో కలిసి విద్యార్థుల హక్కుల సాధన కోసం జరిగిన ఉద్యమాలకు నాయకత్వం వహించి, పోరాడిన ఘనత నాగేశ్వరరావు కి దక్కుతుందని తెలిపారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అంటూ విశాఖ ఉక్కు ఉద్యమంలో విద్యార్థి నాయకునిగా కీలక పాత్ర పోషించారని, సిపిఐ పార్టీ ఉమ్మడి కృష్ణా జిల్లా సమితి కార్యదర్శిగా 18 సంవత్సరాలు పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేశారని, కార్యకర్తలకు కూడా స్ఫూర్తినిచ్చారని నాగుల్ మీరా వెల్లడించారు. కృష్ణా జిల్లాలో అనేక భూ పోరాటాలకి నాయకత్వం వహించిన కొల్లి సెంటు భూమి లేని నిరుపేదలకు భూపంపిణీ చేసిన ఘనత కూడా నాగేశ్వరరావు కి దక్కుతుందని ఉదయ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రధాన కార్యదర్శిగా 10 సంవత్సరాలు పనిచేసిన కొల్లి చల్లపల్లి భూ పోరాటంలో, నూజివీడు తాలూకా భూ పోరాటంలో, తిరువూరు తాలూకా భూ పోరాటంలో కూడా పేదల తరపున పోరాడి, అరెస్టు అయ్యారని, పేదలకు భూములు దక్కేవరకు పేదల నాయకుడిగా అవిశ్రాంతి పోరాటం సాగించారని ఆయన తెలిపారు. కొల్లి నాగేశ్వరరావు నిస్వార్థ ప్రజాసేవలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఏకొండూరులో....

ప్రముఖ రైతుబాంధవుడు తనజీవిత కాలం మొత్తం రైతాంగ సమస్యలపై పోరాడుతూ ప్రభుత్వాలపై వత్తిడి తెచ్చి సమస్యలు పరిష్కరించిన కొల్లి నాగేశ్వరరావు ధన్యజీవి అని రైతు సంఘం సీనియర్ నాయకులు దాడి ఆదినారాయణ అన్నారు. ఎ కొండూరు మండలం గొల్లమందల గ్రామంలో కొల్లి నాగేశ్వరరావు తృతీయ వర్ధంతిని ఘనంగా జరిపారు. ఆదినారాయణ మాట్లాడుతూ భూమిలేని పేదలను సమీకరించి ఎర్రజండా చేతపట్టి ప్రత్యక్ష భూ ఆక్రమణ చేసి జిల్లాలో వేలాది ఎకరాలు పేదలకు పంచిపెట్టిన ఘనత ఆయనకే దక్కిందని నాగేశ్వరరావు సేవలను కొనియా డారు. సీపీఐ మండల కార్యదర్శి మేకల డేవిడ్ ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడుతూ మండలంలోని గొల్లమం దల గ్రామంలో 700 ఎకరాల అటవీబంజరు భూమి ఆక్రమించి ఆ భూమి పేదలకు చెట్టుపట్టాలు ఇచ్చేవరకు పోరాడిన మహోన్నత వ్యక్తి అని అలాగే కనిమర్ల రంగాపురం అటవీ భూములలో ఎర్రజెండాలు పెట్టి వేలాది ఎకరాలు ఆక్రమించి ఆభూమిని పేదలకు దక్కేవరకు మహోన్నతమైన ఉద్యమాలు నడిపిన జననేత కొల్లి అని రాష్టంలో గాని జిల్లాలో గాని జరిగిన భూపోరాటాల్లో ఆయన పాత్ర మరువలేనిదని డేవిడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి రాములు. జి.వెంకటరత్నం ఎం.లక్ష్మయ్యకృష్ణారావు. తదితరులు పాల్గొన్నారు.

బ్లేడ్‌తో దాడి...

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: డబ్బుల విషయంలో గొడవపడి ఓ వ్యక్తి పై బ్లేడ్‌తో దాడి చేశాడు. ఈ ఘటన విజయవాడ భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. విద్యాధరపురంకు చెందిన మద్దాడ దుర్గాప్రసాద్ క్యాటరింగ్ పనులు చేసుకుంటూ ఫ్లైఓవర్ కింద నిద్రపోతూ ఉంటాడు. ఈనెల 20వతేదీన క్యాటరింగ్ పనులకు వెళ్లి తన స్నేహితులతో పున్నమిఘాట్ వద్ద స్నానం చేశాడు. కేటరింగ్ పనులు వచ్చిన డబ్బులు విషయంలో స్నేహితుడు రాజుతో గొడవ జరిగింది.దీంతో రాజు బ్లేడ్‌తో దుర్గాప్రసాద్ గొంతు పై కోసి. రూ.3500 నగదు తీసుకుని పరారైయ్యాడు. గాయాలైన బాధితుడిని భవానీపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మందలించారని.. యాసిడ్ తాగి ఆత్మహత్య

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: మద్యం సేవిస్తున్నాడని మందలించారని యాసిడ్ తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆదివారం విజయవాడ పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. రామవరప్పాడుకు చెందిన జీ. పెద్దిరాజు (45) పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికు భార్య ఇద్దరు సంతానం. పెద్దిరాజుకు మద్యం సేవించే అల వాటు ఉంది. నిత్యం మద్యం సేవించి కుటుంబ సభ్యులతో గొడవ పడుతున్నాడు. ఈనేపథ్యంలో ఈనెల 20వతేదీన మద్యం సేవించి గొడవ పడ్డాడు. భార్య మందలించడంతో ఇంట్లో యాసిడ్ తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు.కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈమేరకు పటమట పోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

గుండె నొప్పితో సీపీఐ నాయకులు చాట్ల మృతి

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలు సీపీఐ గ్రామ కార్యదర్శి కామ్రేడ్ చాట్ల లక్ష్మయ్య (66) ఆదివారం ఉదయం గుండె నొప్పితో మృతిచెందాడు. ఆయన గుండె నొప్పిరావడంతో ఆయన కుమారులు ఖమ్మం ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందారని, పెనుగంచిప్రోలు రాత్రికి మృతదేహాన్ని గ్రామానికి తీసుకుని వస్తునట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న వారి బంధువుల ఆర్త నాదాలతో తూర్పు దళితవాడలో విషాద శాయాలు అలమ్ముకున్నాయి.

గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కృష్ణాజిల్లా అధ్యక్షుడిగా గోపీచంద్

విశాలాంధ్ర-విజయవాడ : ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (384/2022) కృష్ణాజిల్లా అధ్యక్షులుగా గుంటూరు. గోపీచంద్ నియమితు లైయ్యారు. విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యాలయంలో గామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్. అబ్దుల్ రజాక్ ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగినది. ఈ సమావేశానికి వివిధ జిల్లాల నుంచి గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షులు కేఆర్ సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి జి.ఆస్కార్ రావు హాజరయ్యారు. ఈ రాష్ట్ర కార్యవర్గ సమావేశనికి హాజరైన సభ్యుల సమక్షంలో ఆస్కార్ రావు కృష్ణాజిల్లా కమిటీని ప్రకటించి, నియామక పత్రాన్ని అందించారు. కృష్ణాజిల్లా కమిటీ వివరాలు: అధ్యక్షులు-జి.గోపిచంద్,జిల్లా ప్రధాన కార్యదర్శి -కె. ఐజక్ ఏసుపాదం, సహాధ్యక్షులు -పి.మోహన కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్-సీహెచ్. కాంతరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ -టీ. శ్రవణ కుమార్, కోశాధికారి- కె.నవీన్, ఉపాధ్యక్షులు- కె.. సాయి బాబు, జి. వాసు, డి.సురేఖ, జాయింట్ సెక్రటరీలు- కె.. సుబ్బారావు, వి. లావణ్య, కె..కిరణ్ కుమార్, కార్యవర్గ సభ్యులు-ఆర్.. రాజేష్ రామెళ్ళ,ఎస్కె కరిముల్లా,జే. శ్రీవాణి, వై.సాయి ఫణీంద్ర, ఎస్కె మదరస, జి.నాగరాజు ఉన్నారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు, 9 నెలలు ఆలస్యంగా ప్రొబేషన్ డిక్లరేషన్ చేసినందుకు గాను బకాయిలు చెల్లించాలని, సచివాలయ ఉద్యోగులకు స్పష్టమైన పదోన్నతి ఛానల్ కల్పించాలని, ఉద్యోగులందరికీ జాబ్ చార్ట్ అమలు పరచి అధికారాలు కల్పించాలని జిల్లా అధ్యక్షులు గోపిచంద్ ప్రభుత్వాన్ని కోరారు.

బటన్ నొక్కుడే.. కానీ...నిధులు పడలేదు

డ్వాక్రా మహిళలతో సంబరాల పేరుతో సభ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి (ఫైల్)

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: డ్వాక్రా మహిళలకు రుణమాఫీ సొమ్ములకు సంబంధించి ముఖ్యమంత్రి జగన్ మార్చి నెలలోనే బటన్ నొక్కి రూ.కోట్ల నిధులు మహిళల ఖాతాలకు జమ చేస్తున్నట్లు ప్రకటించారు. ఇదే విషయాన్ని మరోమారు చెబుతూ, తిరువూరు శాసనసభ్యుడు కె.రక్షణనిధి అదే నెల 27వ తేదీన విస్సన్నపేటలో మహిళలతో సంబరాల పేరుతో భారీ సభ పెట్టి, బటన్ నొక్కి మహిళల ఖాతాలకు నిధులు జమ అయినట్లు ప్రకటించారు. క్షేత్రస్థాయిలో నెలలు గడుస్తున్నా, పలువురు మహిళల ఖాతాలకు ఇంకా సొమ్ము జమ కాకపోవటంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేకంగా అగ్రవర్ణ పేద మహిళలు సభ్యులుగా ఉన్న సంఘాలకే నిధులు నిలిపివేసి, కక్షసాధింపుకు పాల్పడుతున్నారని పలువురు మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాతకుంట్ల పంచాయతీలో అగ్రవర్ణ పేద, మధ్యతరగతి మహిళలు సభ్యులుగా ఉన్న 20 సంఘాలకు నిధులు జమ కాకపోవడాన్ని మహిళలు ఉదహరిస్తున్నారు. తమకు మాత్రమే నిధులు ఎందుకు జమ కాలేదో అధికారులను తెలుసుకునే ప్రయత్నం చేయగా, మరికొద్ది రోజుల్లో నిధులు జమ అవుతాయనే సమాధానం మినహా, జాప్యానికి గల కారణం మాత్రం తెలపటం లేదని వాపోతున్నారు.

మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రతి రోజూ మహిళలు పెద్దసంఖ్యలో వెలుగు కార్యాలయానికి వస్తూ, ఇక్కడ అవసరమైన సమాచారం లేక, నగదు ఎప్పుడు జమ అవుతుందో తెలియక ఉసూరంటూ ఇళ్లకు వెళుతున్నారు. ఈ విషయమై వెలుగు ఏపీఎం జమలయ్యను విచారించగా, పలువురు మహిళల ఖాతాలకు ఇప్పటికీ సొమ్ములు జమకాని మాట వాస్తవమేనన్నారు. ఎంతమంది మహిళల ఖాతాలకు నగదు జమ అయ్యిందీ, ఇంకా ఎందరికి జమ కావలసి ఉందనే విషయాలు తమకు తెలియదన్నారు. త్వరలోనే అందరి ఖాతాల్లో నిధులు జమ అవుతాయని మాత్రం ఆయన వెల్లడించారు.

సెల్ ఫోన్ అందజేత

విశాలాంధ్ర-తిరువూరు: తిరువూరు మండలంలోని వామకుంట్ల నుండి మునుకుళ్ళ రోడ్ లో వాకింగ్ కి వెళ్తున్న సమయంలో సెల్ ఫోన్ దొరకగానే సంబంధిత వ్యక్తికి అప్పగించి తన నిజాయితీని నిరూపించుకున్న సంఘటన ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే వామకుంట్ల గ్రామానికి చెందిన గోదా సత్యనారాయణ, మళ్ళా రమేష్, రామడుగు గురుప్రసాద్ లు ఉదయ కాలపు నడకకు వెళ్లుచుండగా వారికి రూ.18వేల విలువైన స్మార్ట్ ఫోన్ దొరికింది. వెంటనే మొబైల్ ఎరుకోపాడు గ్రామానికి చెందిన యువకునికి చెందినదిగా గుర్తించిన సత్యనారాయణ మొబైల్ జారవిడుచుకున్న యువకునికి ఫోన్ చేసి అందజేశారు. గోదా సత్యనారాయణ నిజాయితీని గ్రామస్తులు ప్రశంసించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

విశాలాంధ్ర-నందిగామ రూరల్ : నందిగామ మండల పరిధిలోని జొన్నలగడ్డ గ్రామంలో ఓ రైతు పొలం నందు బావిలో మృతదేహం ఉన్నట్లు ఆదివారం సాయంత్రం స్థానికుల సమాచారం ద్వారా తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు మృతదేహాన్ని పరిశీలిస్తే సుమారు నాలుగు ఐదు రోజుల క్రితం బావిలో పడినట్లుగా నిర్ధారణ అవుతుంది ముఖమంతా గుర్తుపట్టడానికి వీలు లేకుండా పురుగులు పట్టి ఉండటం ఆనవాలు తెలుసుకోవడానికి కొంత ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి ఎవరు ఏమిటి అనేది పూర్తి సమాచారం తెలియాల్సి ఉందని స్థానిక పోలీసులు తెలుపుతున్నారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మృతదేహాన్ని పోస్టుమార్టం కు తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు ఒకపక్క ఎండాకాలం కావడం వలన రైతులు పెద్దగా పొలాలకు వెళ్లకపోవడం తో బావిలో ఉన్న మృతదేహాన్ని గుర్తించలేని పరిస్థితి ఏర్పడినట్లుగా కూడా స్థానికులు చెబుతున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర-విజయవాడ : ఎంజే నాయుడు సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ సహకారంతో సింగ్‌నగర్‌లోని వివేకానంద సెంటినరీ హైస్కూల్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని హాస్పటల్ ఫౌండేషన్ చైర్మన్ వావిలాల రజనీకాంత శర్మ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలకు ఒత్తిడి ప్రధాన కారణం అన్నారు. ఎంజే నాయుడు హాస్పటల్ వైద్య నిపుణులు రవితేజ, వంశీకృష్ణ, మణికుమార్, నాగేశ్వరరావు పాల్గొని రోగులకు ఎముకలు, కీళ్లు, నరాలు, కండరాల సమస్యలకు సంబంధించి వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ సుగర్, ఎముకలు అరుగుదల, వంటి సమస్యలపై అవగాహన కలిగించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో 306 మంది రోగులు ప్రయోజనం పొందారు. ఈ కార్యక్రమంలో వివేకానంద సెంటనరీ హైస్కూల్ కరస్పాండెంట్ దుర్గాప్రసాద్, సిబ్బంది వివిఎస్ఎన్ మూర్తి, జి.వి.సత్యనారాయణ, స్థానిక విశ్వహిందూ పరిషత్ నాయకులు టివి.శేఖర్, రామకృష్ణ తదితరులు పాల్గొని రోగులకు సేవలు అందించారు. ఇటీవల రైలు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చెయ్యి కోల్పోయిన రోగికి శిబిరంలో పరీక్షలు నిర్వహించటం జరిగింది.

స్వర సిరులు వర్షింపజేసిన చిత్రగీతాలాపన

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : పద్మశ్రీ ఘంటసాల కళాపరిషత్ (ఒంగోలు) సమర్పణలో ఆదివారం సాయంత్రం కౌతా పూర్ణానందం కళావేదికపై ఘంటసాల శత జయంత్యుత్సవాల సందర్భంగా స్వరాభిషేకం పేరిట తులసి బృందంతో జరిగిన చిత్ర గీతాలాపన శ్రోతలపై స్వర సిరులు వర్షింపచేస్తూ సాగింది. గాయని గాయకులుగా లక్ష్మీతులసి,శ్రీదేవి, సంస్థ అధ్యక్షుడు యు కోటేశ్వరరావు,పురాణం సుబ్రహ్మణ్యం,కె కృష్ణమోహన్, శేషగిరిలు దేవా దీన బాంధవ, నేనే రాధనోయి,మాయ చేసి పోతివిరో,ఓహెూ మోహనరూప, రాజశేఖరా,కవాలి సాంగ్ వంటి సంగీత సాహిత్య ఉత్కృష్టతను చాటే ఇత్యాది పాటలను శ్రవణపేయంగా పాడి వినిపించారు. ఎస్ కె బాబు వ్యాఖ్యాతగా వ్యవహరించగా టి నారాయణ,ఆర్ సదానందరావు లు పర్యవేక్షించారు.

కంటి క్యాన్సర్ అవగాహనపై వైటాథన్ వాక్

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : ఎల్.వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ వారు నిర్వహించిన వైటాథన్ వాక్ ను ప్రపంచ ప్రఖ్యాత ఆర్చరీ కోచ్ , ఆంధ్ర ప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ వాక్ ఎల్.వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ క్యాంపస్ నుంచి తాడిగడప సెంటర్ వరకు నిర్వహించారు. ఈ రన్ నందు 500 మందికి పగా పాల్గొన్నారు. ఈ వైటాథన్ వాక్ సందర్భంగా డా.అనసూయ కపూర్, (క్యాంపస్ హెడ్), హిమబిందు యలమంచిలి(కంటి క్యాన్సర్, ఎల్.వి ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్) మాట్లాడుతూ పిల్లలలో సంభవించే నేత్ర క్యాన్సర్ యొక్క సాధారణ లక్షణాలు పట్ల తల్లితండ్రులు, సంరక్షకులు, సమాజం సరియైన అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. తెల్లని రిఫ్లెక్షన్ కనిపించుట ఈ వ్యాధి యొక్క సాధారణ లక్షణాలలో కీలకమైన వాటిలో ఒకటి, సకాలం లో వైద్య చికిత్స పొందాలన్నారు. రెటో నాబ్లాస్టోమా అనే కంటి క్యాన్సర్ ను ముందుగా గుర్తించి క్యాన్సర్ కణితిని తొలగించిచికిత్స అందిస్తే నయమవుతుందనీ, పిల్లల జీవితాన్ని, కంటిని మరియు దృష్టిని కాపాడవచ్చనీ వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన చెరుకూరి సత్యనారయణ గారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియచేసారు. కార్యక్రమం లో పాల్గొన్న అందరికి మరియు ఉదారంగా తమ మద్దతును అందిస్తున్న ప్రాయోజితులకు (స్పాన్సర్లు) అందరికి మేము ఈ విటథాన్ 2018లో ప్రారంభించిన నాటి నుంచి తమ నిరంతర సహాయ సహకారాలు అందిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.ఈ రన్ ద్వారా సేకరించిన నిధులు రెటో నాబ్లాస్టోమా కంటి క్యాన్సర్ తో బాధపడుతున్న పిల్లల వైద్య చికిత్సకు, ఈ చికిత్సకు నూతన పరిశోధనలు కొనసాగించుటకు వినియోగిస్తారనీ వివరించారు.

రాజీవ్‌కు ఘన నివాళులు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేటలో మాజీ ప్రధాని రాజీవ్ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం కాంగ్రెస్‌పార్టీ నేతలు ఘనంగా నివాళులర్పించారు. మండల కార్యదర్శి పి.శాంతభూషణం స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో ఉన్న రాజీవ్ విగ్రహానికి, అనంతరం ఇందిర, మహాత్ముని విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళు లర్పించారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి ఎల్.వి.వెంకట్రావు, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు గోళ్ల గురునాధరావు, మండలపరిషత్తు మాజీ సభ్యులు మేశపాం సత్యానందం, పెండెం నాగేశ్వరరావు, మండల నాయకుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దళితుల రక్షణ కోసమైనా జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

-రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

విశాలాంధ్ర-విజయవాడ : ఏపీలో జరుగుతున్న దారుణాలు కలవరపెడుతున్నాయని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. తెలుగుదేశం ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో 'జగన్ పాలనలో దళితులపై దాడులు, ప్రభుత్వ వైఫల్యాలు' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. విజయవాడ ఐలాపురం హెూటల్‌లో ఆదివారం టీడీపీ నేత వర్ల రామయ్య అధ్యక్షత ఈ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరువది సుబ్బారావు మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రంలో మనుస్మృతిని అమలు చేస్తున్నాడని ఆరోపించారు. దళిత, గిరిజనులపై దాడులు జరుగుతున్నా కనీసం వారి కుటుంబాలను పరామర్శించి భరోసా కల్పించటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మద్య నిషేదం అమలు చేస్తామని హామి ఇచ్చిన జగన్ రాష్ట్రంలో మద్యం, గంజాయి బెల్టుషాపులు నడుస్తున్నా చర్యలు చేపట్టం లేదని విమర్శించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ దళితులు కేసులు పెట్టినా పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. దళితులు హత్యకు గురవుతున్నా కేసులు నమోదు కావడం లేదన్నారు. దళితుల రక్షణ కోసమైనా జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని మందకృష్ణ పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి పలువురు దళిత సంఘాల నేతలు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీలకు గతంలో ఎప్పుడు లేనంతగా అన్యాయం జరుగుతోందని ధ్వజమెత్తారు. రాజ్యాంగ పరంగా లభించిన హక్కులను పొందలేని పరిస్థితి ఉందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం జగన్ ముందుగా ఎస్సీలనే వంచించారంటూ మండిపడ్డారు. జగన్ ప్రభుత్వంలో మాలలు, మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ధ్వజమెత్తారు. నాలుగేళ్ల వైసీపీ పాలనలో ఎస్సీలపై 8వేలకు పైగా దాడులు జరిగాయన్నారు. పల్నాడు జిల్లాలో ఒక ఎస్సీ మహిళను దారుణంగా హత్య చేశారని మండిపడ్డారు. వైసీపీ పాలనలో ఎస్సీలు 25ఏళ్లు వెనక్కు వెళ్లారని వాపోయారు. ఎస్సీలంతా ఏకం కానంత వరకు సమస్యలు పరిష్కారం కావని చెప్పారు. ఈ రాష్ట్రాన్ని జగన్ పాలన నుంచి విముక్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. టీడీపీ నేత నక్కా ఆనందబాబు, కొలికపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హాట్‌టాపిక్‌గా ఎంపీ కేశినేని మాటలు

విశాలాంధ్ర-నందిగామ రూరల్ : రాజకీయాలలో ఏప్పుడు ఏది మాట్లాడినా ఆచితూచి మాట్లాడాల్సిన అవసరం ఉందనేది విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ మాటలను బట్టి మరోసారి రుజువైందని చెప్పవచ్చు. నందిగామ నియోజకవర్గ పరిధిలోని చందర్లపాడు మండలంలో తోటరాములపాడు గ్రామంలో ఆదివారం జరిగిన జగనన్న కాలనీలో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి రూ.47 లక్షల ఎంపీ నిధులను అందించి శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ మాట్లాడారు. ప్రస్తుతం నందిగామ రాజకీయాలలో హీట్ పుట్టిస్తున్నాయి. ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహన్‌రావును విజయవాడ టిడిపి ఎంపీ కేశినేని శ్రీనివాస్ పొగడటం అదే మాదిరిగా ఎంపీ శ్రీనివాస్‌ను వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్న జగన్‌మోహన్‌రావు పొగడటం నందిగామ టిడిపి వైసిపి నాయకుల మధ్య ఆలోచనల పర్వం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఆదివారం ఎంపీ కేసినేని మాట్లాడిన మాటలు గత కొద్ది నెలల క్రితం మైలవరంలో అంతకుముందు తిరువూరులో ఇలా చెప్పుకుంటూ పోతే(ఒక్క జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలో జరిగిన కార్యక్రమం తప్ప)ఒక ఎంపీ గా కేశినేని శ్రీనివాస్ చేస్తున్న పనులను మెచ్చుకోవాలో ఒక టీడీపీ ఎంపీగా ఆయన మాట్లాడే మాటలను ఎదురించాలో ఏం మాట్లాడాలో అర్థం కాని పరిస్థితిలో విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ టిడిపి క్యాడర్ ఉందంటే అతిశయోక్తి లేదు ఏది ఏమైనాపటికి ఎన్నికల సంవత్సరం మొదలైనప్పుడు ఏ రాజకీయ నాయకుడు ఏం మాట్లాడినా ఎక్కడ తప్పులు తొర్లి ఇబ్బందులు ఎదురవుతాయో అని ఆచితూచి మాట్లాడే సమయంలో వైసీపీ ఎమ్మెల్యేలతో కలిసి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనటమే కాకుండా వారిపై పొగడ్తలు ముంచెత్తటం అనేది నందిగామ టిడిపి కార్యకర్తల్లో ఉన్న అంతర్మాదానికి అవధులు లేకుండా పోయాయి అని రాజకీయ మేధావులు అంటున్నారు ఇది ఇలాగే కొనసాగితే రానున్న ఎన్నికలలో నూతనంగా ఏర్పడిన ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడ పార్లమెంటు పరిధిలో ఎమ్మెల్యే ఎన్నికలకు పార్లమెంట్ ఎన్నికలకు తీవ్రమైన వ్యత్యాసం వస్తుందని కొన్ని సందర్భాల్లో పార్టీ తీవ్రంగా నష్టపోయే అవకాశాలు కూడా లేకపోలేదని ఆదివారం సాయంత్రం చర్చించుకోవడం విశేషంగా మారింది మరి ఈ విషయంపై ఇరుపక్షలు ఎలా స్పందిస్తాయో ఈ వేదిక రాజకీయ వేదిక కానుందా లేక పార్టీ మార్పులకు ఏదైనా దోహదం చేస్తుందా అనేది కూడా వేచి చూడాల్సి ఉందని మేధావులు అంటున్నారు.

రేపు మండలపరిషత్తు సమావేశం

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేట మండలపరిషత్తు సర్వసభ్య సమావేశం ఈనెల 23వ తేదీన జరుగుతుందని ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ తెలిపారు. ఆరోజు సాయంత్రం 3గంటలకు స్థానిక వెలుగు కార్యాలయంలో ఎంపీపీ పి.మెర్సీ వనజాక్షి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు, సభ్యులు హాజరు కావాలని ఈ సందర్భంగా ఆమె కోరారు.

నెమలిలో గోశాలకు రూ.25 వేల వితరణ

విశాలాంధ్ర-గంపలగూడెం : ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం నెమలి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానం లోని గోశాలకు ఎన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణానికి చెందిన తాళ్లూరి .మనీ వర్ధని 25 వేల రూపాయలు ఆలయ కమిటీ చైర్మన్ కావూరి. శశిరేఖకు ఆదివారం నాడు అందజేశారు. అనంతరం దాతకు స్వామివారి దర్శనం గావించి, స్వామివారి ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలలో వేసవి విజ్ఞాన శిబిరాలు

విశాలాంధ్ర-గంపలగూడెం : మండలంలోని గంపలగూడెం , పెనుగొలను శాఖ గ్రంథాలయాల్లో ఆదివారం నాడు వేసవిజ్ఞాన శిబిరాల్లో భా గంగా విద్యార్థిని ,విద్యార్థులకు పలు అంశాలు నేర్పించారు. పెనుగొ లను శాఖా గ్రంథాలయంలో మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా జాతీయ తీవ్రవాద వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. అనంతరం చదరంగం, క్యారమ్స్, కుర్చీలాట ఆడించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు ఉమా. శేషి రెడ్డి , షిరిడి సాయి సేవ సమితి నాయకులు నారాయణరావు, ఉపాధ్యాయులు హేమలత ,గ్రంథాలయ అధికారిని వి. జ్యోతిర్మయి ,విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థిని, విద్యార్థులకు క్యారమ్స్ ,స్కిప్పింగ్, త్రోబల్ తదితర ఆటలు ఆడించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి నాగేశ్వరావు, విద్యార్థిని ,విద్యార్థులు పాల్గొన్నారు.